# వినాయకుడి వీణ

జన ప్రవాహానికి ప్రయాసతో ఎదురు ఈదుకుంటూ కాస్త ఆలస్యంగా ఇల్లు చేరుకున్న రవి విశాలమైన కళ్ళలో ఎన్నో ధర్మసందేహాలు. తన చుట్టూ కనవడుతున్న ప్రపంచాన్ని తను చదువుకుంటున్న పాఠాల్లోని సుభాషితాల్తో అన్వయించుకుని అప్పుడప్పుడు అయోమయ స్థితిలో పడిపోతూ ఉంటాడు.

ఆ రోజు స్నేహితులతో కలిసి టాంక్ బండ్ దాకా పోయి వినాయకుల నిమజ్జనం కొంతవరకూ చూసి ఇంక చీకటి పడిపోతుందనగా ఇంటి ముఖం పట్టాడు. దారిపొడుగునా రాజకీయ నాయకులు ఉత్సవంలో పాల్గొని ఉపన్యాసాలిస్తూ ప్రసాదాలు పంచుతూ రక్తి కట్టిస్తారు. ఆకాశంలో హెలికాప్టర్ తిరిగింది. వీధి వీధినుండీ వాడవాడనుండీ వినాయకులు అంచలంచలుగా లారీలమీద కదలివెళ్ళారు. విగ్రహాలు క్రేన్ సహాయంతో నీట మునుగుతున్నాయి. ఎక్కడికక్కడ పోలీసు బందోబస్తు. ఇతర వాహనాల రాకపోకలకు ప్రత్యేక నిబంధనలూ అంక్షలూ. ఒక వినాయకుడి విగ్రహం 30 అడుగుల ఎత్తుంటే ఇంకొకటి 35 అడుగుల ఎత్తు. ఇలా రూపాల్లో, పరిమాణాల్లో, ఎత్తులో, అలంకర

ణలో వినాయకులు పోటీ పడుతున్నారు. అధికారపుటంచనా ప్రకారం చిన్నా పెద్దా సుమారు ఐదువేల విగ్రహాలకు పైగా నిమజ్జనం కావలసి ఉందని ఎందరో చెప్పుకుంటున్నారు దారిలో

రవి నాన్నకు ఆ రోజు ఒంట్లో సులువుగా లేదుకానీ ఉంటే ఆ రాత్రి నిమజ్జనం పూర్తి అయ్యేదాకా ఉండి ఇంటికి వచ్చేవాడే. ఇంట్లో పూజ చేసుకువి గోడకు వేలాడుతున్న దైవ స్వరూపాలన్నిటికీ అప్పుడే కుంకుమ బొట్టు పెట్టి, తనూ ఫాలభాగాన బొట్టు దిద్దుకుని వీధి గుమ్మం లోకి వచ్చాడు. తండ్రిని చూస్తూనే రవి వీధి మెట్లు ఎక్కుతూ తన మనసులోని సందేహాన్ని యక్ష ప్రశ్నలాగ సంధించాడు.

"నాన్నా అశోకుడు చెరువులు తవ్వించాడనీ బావులు తవ్వించా డనీ హిస్టరీ పాఠంలో చెప్పారుకదా మరి టాంక్ బండ్ దగ్గిర ఎన్ని విగ్రహాలో ముంచుతూ——" అంటూ అమాయకంగా వేస్తున్న చిన్నారి ప్రశ్న పూర్తి కాకుండానే నోరు మూయించి "అయ్యో! ఎంత అవాచ కంరా! చదవ్వేస్తే ఉన్నమతి పోయినట్లు భయంభక్తీలేని ప్రశ్న. నాస్తికుడివైపోవుకదా" అని అడ్డుపడ్డాడు రవి నాన్న. రవి మనసులోని సందేహం అలాగే ఆ చిన్నారి మనసులో ఉండిపోయింది.

ఆ రాత్రి మెల్లగా నిద్రలోకి జారుకునే వేళ రవికి ఎవరో ప్రేమతో నిమిరినట్లు అనిపించింది. తమాషా అయిన కల. వినాయకుడు రవిని తన తొడమీద కూర్చోపెట్టుకున్నాడు. వింతగా వీణ మీటినట్లు వినిపించాయి రవి చెవిలో వినాయకుడి మాటలు. "తమ్ముడూ! నీ సందే హం నిజంగా అడగవలసినదే. సిగ్గుపడకు. చెరువులూ బావులూ తవ్వించి ప్రజలకిచ్చిన అశోకుడు గొప్పవాడే. నా పేరుమీద చెరువులూ సర

స్సులూ పూడ్చుకోవడం వేడుకైపోయింది. తేరగా ప్రజల డబ్బువుంది. మళ్ళీ డ్రెడ్జింగ్ కంపెనీకి పని ఇచ్చి పూడిక తీయించుకుంటారు— అవసరమైతే. వాళ్ళ పిచ్చి కూలా! నువ్వు అలసిపోయావు. ఇంక పడుకో" అంటూ ప్రేమగా రవిని పడుకోబెట్టి అదృశ్యమైపోయాడు.

'కలడు కలండనెడి వాడు కలడో లేడో' అన్న మీమాంస ఇంకా ఉదయించని వయసువాడు రవి. దేవుడు కూడా తనలాగే ఆలోచిస్తాడన్న తియ్యని ఊహ ఎంతో ఉపశమనం కలిగించింది ఆ చిన్నారి మనసుకి.

—ఉదయం నవతరం వారపత్రిక 9-2-1990